
# బహుపరాక్

★

రచన :

* శ్రీ వెంపలి వెంకటశివప్రసాద్. *



స్వాతంత్ర్య దినోత్సవంనాడు కాలేజీలో జరుగుతున్న సభలో రమణమూర్తి ఉత్సాహంగా చదువుతున్నాడు-

దేశమంటే మట్టికాదోయ్!
దేశమంటే మనుషులోయ్!

చదివే ధోరణి ఎలా ఉందంటే గేయాన్ని తనే వ్రాసాడా! అన్నంత దీమాగావుంది. మృదు మధురమైన నాదంతో గేయం చదివి ముగించాడు. ప్రేక్షకుల కరతాళధ్వనులతో మార్మోగిపోయింది ఆ ప్రదేశం ఆ సమయంలో. రమణమూర్తి మెదడుకు ఒక ఆలోచన తట్టింది. అదేమిటంటే - ఎవరిదో గేయం చదివితేనే తనను అంతగా ప్రశంశించారే, ఆ గేయాన్ని స్వయంగా తనే రాసుంటే ఇంకెంతగా మెచ్చుకునే వారో?......ఏం నే నెందుకు వ్రాయకూడదు. వ్రాస్తాను...గేయాలు వ్రాస్తాను... కవితలు వ్రాస్తాను...అన్నీ వ్రాస్తాను. నేనెందుకు రచయితను కాకూడదు...కాగలను. నేనూ రచయితను కాగలను. ఏది ఏమైనా వచ్చే స్వాతంత్ర్యదినోత్సవం నాటికి నేను కూడా రచయితగా గుర్తింపబడాలి. "సాధన చేయుమురా నరుడా! సాధ్యముకానిది లేదురా!" అని అనే అన్నాడు ఒక మహానుభావుడు. నిర్ణయాన్ని బలపరుచున్నాడు రమణమూర్తి. స్వాతంత్ర్య దినమే మంచి ముహూర్తంలా తోచింది. ఆ రాత్రికే రచనావ్యాసంగాన్ని ప్రారంభించడానికి ఉపక్రమించాడు.

రాత్రి తొమ్మిది గంటలయింది. కాగితం, కలం సిద్ధంగా ఉంచుకున్నాడు. లోగడ ఎవరో అనగా విన్నాడు. "సాధారణంగా సిగరెట్లు పీలిస్తేగాని రచయితల మూడ్ రాదట" అని. అందుకే ఖరీదైన సిగరెట్ తీసి వెలిగించాడు. ఇది రమణమూర్తి నిర్మించే సాహితీ సౌధానికి పునాదిరాలు అన్నమాట. ఎన్ని దమ్ములు లాగినా మూడ్ రావడం లేదు పాపం రమణమూర్తికి. మరోసిగరెట్ తీసి వెలిగించాడు. ఇలా ఒక దాని తర్వాత ఒకటి మూడు సిగరెట్లు మసి అయ్యాయి కలం మాత్రం కదలడంలేదు.

ఏం రాయాలి? కథానికా? కవితా? ఏం రాయాలి? ఏదో ఒకటి...ఏదోఒకటంటే ఎలా? ముందు ఏది రాయలో నిర్ణయించుకోవాలి. కొత్తగా రచనావ్యాసంగాన్ని ప్రారభించే యువకులు వచన కవితా ప్రక్రియ తోనే ఆరంభిస్తారని ఎక్కడో చదివినట్లు గుర్తు, అందుకే కవిత రాయడానికే నిశ్చయించుకున్నాడు. ఏవిషయం మీదరాయాలి? అదే అంతుచిక్కడంలేదు. దీర్ఘంగా ఆలోచించసాగాడు. ఉన్నట్టుండి మన వాడ దృష్టి ఫ్యాన్ మీద పడింది. నిశ్శబ్దంగా తిరుగుతూ చల్లనిగాలినిచ్చే ఫ్యాన్‌ను గూర్చి ఎందుకు రాయకూడదు. రాస్తాను ఫ్యాన్‌ను గురించే రాస్తాను.

కలానికి ఇంత సేపటికి ఆపని దొరికింది. రెండు

లైన్లు రాసాడో లేదో పరమానందం చెందాడు. ఎలాగో రాత్రిపన్నెండయ్యే సరికి కవిత పూర్తిచేసాడు. మర్నాడే దానినిఒక పత్రికకు పంపిచాడు. కవితను పోస్ట్ చేసినప్పట్నుంచీ, అచ్చులో తన పేరు ఎలాఉంటుందో ఊహించుకుంటూ ఎన్నెన్నో కలలు కంటున్నాడు. ఎడిటర్ గారు నా కవిత చూసి ... ఆహా ... ఏమి కవిత్వం ... ఫ్యాన్ కవిత్వం...ఇంతవరకూ ఏకవీ వ్రాయని కవిత్వం చాలా బాగుంది అనుకుంటారు. ఇలా ఊహాలోకాల్లో తేలిపోతూ కొన్ని రోజులు గడిపాడు. ఒకరోజున పోస్ట్ మన్ ఒక కవర్ తెచ్చి రమణమూర్తికిచ్చాడు. వెంటనే 'ఫ్రమ్' అడ్రస్ చూసాడు. ఎడిటర్ ఫలానా పత్రిక అని వుంది. ఎగిరి గంతేసినంత పనిచేసాడు రమణ. గబగబా తనగది కొచ్చి ఏడు కొండల వెంకటరమణమూర్తిని ప్రార్థించసాగాడు. "స్వామీ నా కవిత ప్రింటయేటట్లు చూడు స్వామీ! నీకు తలనీలాలు ఇచ్చుకుంటాను" అంటూ, ఆత్రుతగా కవరు విప్పాడు. దాంట్లో అతని కవిత, ఉత్తరం ఉన్నాయి.

ఉత్తరం తీసి చదవసాగాడు.

నాయనా! రమణమూర్తీ!

నీ కవరు చేరింది. చలికాలం, నీ ఫ్యాన్ గాలి రెండూ కలవడంతో నాకు చలి ఎక్కువ యింది.

"శ్రీ బాలసుబ్రహ్మణ్యం"

# పంపులు-మోటార్లు

BMF

శ్రేష్ఠమైన లోహాలతో, పనితనంలో అనుభవంగల నిపుణలచే తయారుచేస్తున్నాము.



## విశేషాంశాలు

* స్వల్ప విద్యుచ్ఛక్తితో అధికంగా మంచి నీళ్ళు.
* ఎక్కువ కాలం మన్నికకు నమ్మకమైనది.
* నిశ్శబ్దంగా పరుగు.
* శ్రేష్ఠమైన తయారి,
* ఖర్చులో తక్కువ.

: తయారించువారు :

## బాలసుబ్రహ్మణ్య ఫౌండరి

పటేల్ రోడ్ (Phone No. 24313) కోయంబత్తూరు-641 009.

ఆంధ్రప్రదేశ్ ఏజెంట్లు :—

అసోసియేటెడ్ ట్రేడర్స్ (డక్కన్) నెం. 8570-2 రాష్ట్రపతి రోడ్,

సికింద్రాబాద్ (ఎ.పి.)

ఎల్లప్పుడూ...
ఎమరాల్డ్ బనియన్లనే ఉపయోగించండి.




26, Stanes Rd., 4th St.,
TIRUPUR - 638602
Regd. No. 300188

దయచేసి ఏపత్రికకూ నీ ప్యాన్ క...వి...త్వం అదే చలివలన అక్షరాలు తడబడుతున్నాయ్. ప్యాన్ కవిత్వం పంపకు.

ఇట్లు,
సంపాదకుడు.

రమణమూర్తి ముఖంలో నెత్తురు చుక్క లేకుండా పోయింది. ఆనాటి నుంచి రమణలో పట్టుదల మరింత హెచ్చింది. ఎలాగైనా సరే తనొక రచయితగా గుర్తింపబడాలి. ఎన్నెన్నో కవితలు, కథలు వ్రాస్తున్నాడు. పంపిస్తున్నాడు...తిరిగి వస్తున్నాయి. కొన్నిపత్రికల వాళ్ళు విసిగి త్రిప్పిపంపడంకూడా మానేసారు. రమణమూర్తి మనసు కొంచెం భాధ పడింది. ఎన్నికవితలు, కథలు వ్రాసినా ఒక్కటికూడా అచ్చవడం లేదు. మళ్ళీ స్వాంతంత్ర్య దినం నాటికి తానొక రచయితగా గుర్తింపబడాలనుకున్నాడు. కాని ఫలితం లేకపోయింది. తెల్లవారితే స్వాతంత్ర్యదినం. అప్పుడే రమణమూర్తి రచనలు ప్రారంభించి సంవత్సర మయింది అయినా తనో రచయితగా గుర్తింప బడలేకపోయాడు. కాని ఫలితం లేకపోయింది. మంచి రచయిత అనిపించుకో లేకపోయాడు. ఆలోచనలతో రమణ సతమత మవుతున్నాడు. ఎలాగైనా ఈరాత్రికి ఒక మంచి కవిత వ్రాయాలనుకున్నాడు. ఊహలు వస్తున్నాయ్, పోతున్నాయ్. ఒక్కటీ నిలకడగా వుండడంలేదు. అప్పటికే దాదాపు రాత్రి పదిదాటింది. ఇక లాభం లేదని వెంటనే ఒక నిర్ణయాని కొచ్చాడు.



టర్నర్ జెట్ పంప్స్ & మోటారులు

జెట్ పంప్ (స్పెషలిస్ట్)

మోటారులు :— $\frac{1}{2}$H. P. నుంచి 18 H. P.

పంపులు :— 1" X $\frac{3}{4}$", 1$\frac{1}{2}$" X 1$\frac{3}{4}$"

2" X 1$\frac{1}{2}$", 2$\frac{1}{2}$ X 2"

: తయారించువారు :

Turner Engineering Company

P. N. PALAYAM :: COIMBATORE - 641 037.

## కావలెను

మా ఫాక్టరీలో తయారైన జంకాళాలు, మరియు బెడ్ షీట్లు ప్రసిద్ధి చెందినది. వాడిన ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగా నున్నవారు మంచి లాభము పొందుతున్నారు.

ఎల్. ఐ. సి. ఏజెంట్లు, రిటైరయిన గవర్నమెంటు పనివారినుంచి, తమ మంచి లాభము పొందుటకు ధరఖాస్తులు కోరబడుచున్నాము.

—: వివరములకు :—

# J. P. M. TEXTILES,

**P. B. No. 60 : : BHAVANI - 638 301.**


పతాకావిష్కరణ జరిగిన తరువాత సభ ప్రారంభమయింది. ఆనాటి స్వాతంత్ర్య దినోత్సవ సభ చాలా ఉత్సాహకరంగా వుంది. రమణ కూడా ఉత్సాహంగా ఉన్నాడు. ఎందుకంటే తానొక రచయితగా గుర్తింపబడే రోజు అదే! అధ్యక్షుడు ఒక్కొక్కరి పేర్లు చదువుతున్నాడు. రమణ అధ్యక్షుణ్ణి చూస్తున్నాడు. 'నా పేరు ఎప్పుడు చెప్తావయ్యా!' అన్నట్లుంది ఆ చూపు 'మార్పు' కవిత రమణారావుగారు చదువుతారు. తన పేరు వచ్చీ రాగానే సభా వేదిక పైకి వెళ్ళాడు అంత మంది వ్యక్తుల మధ్య చదవడానికి భయంగావుంది. అయితే గత సంవత్సరం, ఇదే వేదికమీద ఎంతో ఉత్సాంహంగా చదివాడు. కాని ఇప్పుడు...భయం...అప్పటికీ ఇప్పటికీ ఎంతో వ్యత్యాసంవుంది. గుండె దిటవుచేసుకొని చదవడం ప్రారంభించాడు. మధ్యలో ఒకాయన లేచి, "బాబూ! ఈ కవిత లోగడ ఏదో పత్రికలో చదివిన దానిలా వుందే!" అన్నాడు. రమణ నెత్తిమీద పెద్ద బండ పడ్డంత పనయింది. తడబడుతూ "నే...నే...పంపించానండీ...అది...అప్పుడు ప్రింటయింది." అన్నాడు కొంచెం వణుకుతూనే. మళ్ళీ చదవడం ప్రారంభించాడు. ఈసారి చదివే ధోరణి ఏమీ బాగాలేదు. కవిత పూర్తవుతుందనగా గబుక్కున ఒకాయన లేచి, "ఏవయ్యా! నీకేమైనా బుద్ధుందా? భవిష్యత్తులో పైకి రావలసిన కుర్రవాడివి కదా! ఇటువంటి వెధవపనులేనా చేసేది" అంటూ తిట్టడం మొదలెట్టాడు. ఈయన ధోరణి ఎవరికీ అర్థంకాలేదు. రమణ బిగుసుకు పోయాడు. అధ్యక్షుడు కల్పించుకొని, "ఏవిటండీ! ఇతనేం చేసాడు. అలాతిడుతున్నారు? అని ప్రశ్నించాడు. "ఇంకేం చేయాలండీ! చెప్పేవి శ్రీరంగనీతులు చేసేవి వెధవ పన్లూనూ! పెద్దరచయితలా వచ్చి, మా బావగారి తమ్ముడి కొడుకు వ్రాసిన కవితను కాపీ కొట్టి చదువుతాడా?" అన్నాడు. పాపం రమణమూర్తి నలుగురిలో నవ్వుల పాలుకావలసి వచ్చింది. తనొక రచయిగా గుర్తింప బడాలనే తపనలో తనుచేసినపని ఎంత తప్పో ఇప్పుడు తెలిసింది రమణమూర్తికి.

★